# ఆమె దృష్టికోణం

రచన:
దండమూడి మహీధర్ కుమార్

★

ఇప్పుడు విచారించి మాత్రం లాభమేముంది? జీవితరంగంలో మనం అనుకోని ఘటనలు జరిగి పోతుంటాయి. ఊహించుకున్న ఊహాలు ఆకాశకుసుమాల్లాగా అంతర్థానమైపోతుంటాయి.

'నీవు సహృదయుడవు, నీ వ్యక్తిత్వాన్ని చిత్రించేందుకు శిల్పం చాలదు'—అని పలికిన ఇందుకళ 'నీవు అనామకుడవు, నీవ్యక్తిత్వం లోపభూయిష్టం' అన్నదంటే నాకెంతో ఆశ్చర్యం, విచారం ఉద్భవించుకొచ్చాయి. ఆమె దృష్టికోణం నా కవగతంకాలేదు. ఆమె రంగు అద్దాల కళ్ళజోడులో నేను వివిధరూపాల్లో కన్పించాను.

*　　*　　*

కొన్ని పరిస్థితులకు లోనై నేను ఇందుకళకు తప్పక నిన్నే వివాహమాడతానని వాగ్దానం చేయవలసివచ్చింది. స్త్రీకిచేసిన వాగ్దానాన్ని పురుషుడు చెల్లించనిరోజు లోకంలో మహా ప్రళయం జరిగితీరుతుంది, తుఫాను రేపి స్త్రీ హృదయాన్ని కించపరచటం నాకు సుతరామూ ఇష్టంలేదు.

నేను యం. బి. ఫైనల్లో, ఇందుకళ రెండోసంవత్సరం యం. బి. లో వుండగా మా వివాహం జరిగింది. ధనికకుటుంబంలో జన్మించిన ఇందు—ఆర్థికపరిస్థితులు సరిగాలేని నన్ను వివాహమాడటం చాలామందికి ఆశ్చర్య సంభ్రమాలు కలిగించింది. నా సహృదయాన్నీ, వ్యక్తిత్వాన్ని పురస్కరించుకునే వివాహ మాడిన ఇందును ఎంతోమంది ప్రశంసించి—భవితవ్యంలో మేమొక నూతన జగత్తును సృష్టించగలమని అభినందన సందేశాలను పంపారు.

*　　*　　*

ఆర్థికమాంద్యంకొలదీ ఎన్నో బీదకుటుంబాలు తగిన వైద్యసాయం లభించక మృత్యుగహ్వరంలో తలదాచుకుంటున్నాయి. పల్లెవాసాల్లోని జీవితం అస్తవ్యస్తమైపోయింది. వారి దుస్థితిని బాగుపరచాలనే భావం కొలదీ—'హౌస్ సర్జన్' పూర్తయినవెంటనే—ఒక పల్లెటూరిలో హాస్పిటల్ తెరిచాను. తన 'కోర్సు' కూడా పూర్తయితే యిద్దరం కలిసి పల్లెవాసాల్లో నవజీవనాన్ని సృష్టిద్దామని—నేను హాస్పిటల్ తెరిచేరోజున ఇందు పలికింది. ఇందు తండ్రికూడా ఆ రోజు—మీ ఇద్దరి ఆశాకుసుమాలు వికసిస్తాయని ఆశీర్వదించాడు.

నా పనిలో నేను సఫలీకృతుణ్ణి కావాలని పూర్తి యత్నం సల్పాను. ఇందు సాయం కూడా లభిస్తే నేను గ్రామవాసులకు ఎక్కువ సేవ చేయగలనేమోనని తలుస్తూన్న రోజుల్లో హైమసాయం లభించింది.

*　　*　　*

హైమ తండ్రి చాలాకాలం జ్వరంతో బాధపడి చనిపోయాడు. తల్లిని పోగొట్టుకున్న హైమను ఎలాగయినా సంరక్షించమని

ప్రాధేయ పడుతూనే చనిపోయాడు. హైమ తండ్రి, దరిద్రకుటుంబంలో జన్మించిన హైమ అసహాయురాలై పోయింది.

హైమ రక్షణభారాన్ని నేనే వహించి ఎన్నో విషయాలను నేర్పాను. ఒక స్త్రీకి కావలసిన శిక్షణతో పాటు హాస్పిటల్‌కు సంబంధించిన ఎంతో విజ్ఞానాన్ని నీనుంచి తీసుకుంది. నాకు చేదోడు వాదోడుగావుంటూ గ్రామసీమల పునర్నిర్మాణ కార్యరంగంలో ఎంతో రాణించింది.

కాలగర్భంలో నెలలు సంవత్సరాలు విహీతమై పోయాయి. ఇందు ఎప్పుడు రావాలో అప్పుడు రాలేదు. నాకు సహాయకారిగా పని చేసి నా హృదయంలో ఒక కీలక స్థానాన్ని హైమ ఆక్రమించిన మూడు సంవత్సరాలకు ఇందు తిరిగివచ్చింది. నిష్కల్మష హృదయంతో పవిత్ర ఆశయాలను ప్రచారంచేస్తున్న మా కార్యంలో సాయపడి ఇందు మరో నూతన శకారంభం చేస్తుందని భ్రమించాను.

రోజులు గడిచాయి. ఇందు నా పనిలో సహకరించలేక పోయింది. వెనుకటి రీతిగా మాట్లాడటం మానివేసి ఏదో పోగొట్టుకున్న వ్యక్తిలాగా కన్పించజొచ్చింది. అప్పటికి ఆమె వైఖరి నాకు అవగతం కాలేదు.

* * *

ఒక వ్యక్తి తనకన్న మిన్నగా కన్పించిన మరో వ్యక్తిని చూచి—తను ఆస్థాయికి చేరుకోలేని రోజున తన హృదయంలో ఈర్ష్యకు స్థానం ఇవ్వటం జరుగుతుంది. ఇందుకళ హైమను ఈర్ష్యాదృష్టితో చూచింది. తనదిగా భావించుకున్న వస్తువేదో హైమ లాక్కున్నట్లుగా ఇందు బాధపడసాగింది.

ఓ రోజు ఇందుకళ ఈసడింపు భావాలను తన ముఖంలోనే కేంద్రీకరించుకొని నేనున్న గదిలోకి వచ్చింది. ఇప్పటి ఇందుకళకూ మూడు సంవత్సరాల క్రితం ఇందుకళకు ఎంతో వ్యత్యాసం వున్నట్లు గోచరించింది.

నేను మామూలుగానే - ఇందును తన మంచంమీదికి రమ్మని ఆదేశించాను. కుర్చీలో కూర్చొని—'హిమకర్ బాబూ! మీరు ఎల్లవేళలా హైమను మీ గదిలో కూచోబెట్టుకొని కబుర్లతో కాలక్షేపం చేయటం నాకేమీ నచ్చలేదు. మీరు ముందూ, ఆమె వెనుకా నడుస్తూ గ్రామాల్లో తిరుగుతూవుంటారు. ఇలా చేయటంవలన లోకం మిమ్మల్ని శంకిస్తుంది. హైమ అవివాహితగా వుంచినన్నాళ్లూ— సంఘం నన్నూ మిమ్మల్నికూడా ఆడిపోసుకుంటుంది. మీరు హైమ వివాహాన్ని చేసివెయ్యండి. ఆ రోజునే సంఘం మిమ్మల్ని వ్రేలెత్తిచూపటం మానుతుంది. మీరు ఎంత గౌరవ ప్రతిష్ఠలు సంపాదించినా లోకులు మీ వెనుక ఏం చేస్తున్నదీ మీకు తెలీదు'— అని ఎంతో నెమ్మదిగా, భారుగా పలికింది ఇందు.

'కొన్ని పవిత్ర ఆశయాల సాఫల్యంకోసం మేము కృషిచేస్తున్నాం. నీవలె - నాకూ హైమకు మధ్యగల పవిత్ర సంబంధాన్ని - అపార్థం చేసుకునే వ్యక్తులు చాలా తక్కువ మంది వుంటారు! మేం లోక శ్రేయస్సుకోసం పాటుపడుతున్నాం. అలాంటి మమ్ము లోకం అపార్థం చేసుకోలేదు. సంకుచిత దృష్టికోణంలో ఆలోచించినంతకాలం వ్యక్తి మరో వ్యక్తిలో

లోపాలకు లోపాలనే చూడగలుగుతాడు. ఇలా వర్తించటం ఆ వ్యక్తిలోని బలహీనతను వ్యక్తం చేస్తుంది'—

'హైమ వివాహం చేసుకునేందుకు నిరాకరించింది. ఈ సేవా కార్యంలోనే తన జీవితాన్ని వెళ్ళబుచ్చుకోవాలని వుందని హైమ చెప్పింది. ఆమె భావాలకు విరుద్ధంగా వర్తించటం అసమంజసమని తలచాను—' అని ఇందుకు సమాధానమిచ్చాను.

ఇద్దరం కొంచెంసేపు మౌనంగానే వుండిపోయాం. అడుగులో అడుగేసుకుంటూ ఇందు మారుమాట్లాడకుండా బయటికి నడిచింది. ఆ నిమిషంలో ఆమె తన భావాలూ నా భావాలూ 'కోయిన్సైడ్' కావటంలేదని భావించినట్లు—నేను తెలుసుకో గలిగేను. ఈభావం నాలో కలగగానే నాకు వెనుకటి విషయాలు స్మృతిపథంలో తారట్లాడాయి. మా వివాహపు సంఘటనా, ఆనాటి అభినందన సందేశాలూ—ఇంకా ఎన్నెన్నో విషయాలు గుర్తుకొచ్చాయి. నిర్భేద్యమైన మా వివాహబంధనం తానంతట దే విడుచుకపోతున్నట్లు తలపోశాను. మా గార్హ్యస్థజీవితం ఏరోజునుంచి ప్రారంభం కావలసివుందో, ఆరోజునుంచే అంత్యం కాబోతూందని—వూహించుకోజొచ్చాను. ఆమెలోని ఉన్నతభావాలు ఎలా మరుగుపడిపోయాయో నాకు తెలీలేదు. నన్ను వివాహమాడి ఆమె ఎంతో విశాలదృక్పథాన్ని ప్రదర్శించుకుంది. స్నేహితుల మన్ననలకు పాత్రురాలయింది. కాని ఈరోజు ఆమె దృష్టికోణం...

నా భావపరంపర సాగిపోతూనేవుంది. ఎలాగో బలవంతంగా ఆలోచించటం మానివేశాను.

మరో రోజు ఉదయం పదిగంటలకు తెలిసింది. ఇందు వెళ్లిపోయిన విషయం! హాస్పిటల్‌లోవున్న నాకు వెంటనే ఆమెకోసం వెదకవలసిన అవకాశంలేకపోయింది. ఆమె వెళ్లిన సంగతి హైమకూ్కడా తెలీదు. ఆమె కూడా హాస్పిటల్‌లోనేవుంది. ఇంటికొచ్చాక నౌకరు తానే ఇందుకళను స్టేషన్ వరకూ వెళ్ళి రైలు ఎక్కించి వచ్చానని — తెలీజేశాడు.

డ్రాయర్ మీద ఓ కవరు! కవరులో ఇందు వ్రాసిన లేఖ కన్పించాయి. దానిలో ఆమె—తాను శాశ్వతంగా వెళ్లిపోతున్నాననీ, మీరు నిర్వర్తించే బాధ్యతల్లో సగంపాలు పంచుకునే హైమను వివాహమాడి సుఖంగావుండండి! అదే నా అంతిమ అభిలాషనీ— తెలీజేసిం లేఖలో 'నీవు సహృదయుడవు, నీ వ్యక్తిత్వాన్ని చిత్రించేందుకు శిల్పం చాలదు,' — అని పలికిన ఇందుకళ 'నీవు అనామకుడవు నీ వ్యక్తిత్వం లోపభూయిష్టం' అనికూడా తెలీజేసింది.

ఈ లేఖ చూచాక నాకు ఆశ్చర్యం, విచారం ఉద్భవించుకొచ్చాయి.

* * *

ఇందు తన తండ్రి ఇంటికి వెళ్లిపోయి వుంటుందని భావించాను. కాని కొద్ది రోజులకే—ఇందు — తాను, మద్రాస్‌లో గవర్నమెంట్ హాస్పిటల్‌లో పనిచేస్తూన్నట్లు లేఖ ద్వారా తెలీజేసింది.

వెనుకటివలె నేను హైమా కలిసి — ఆర్థికమాంద్యం కొలదీ కృంగి కృశించిపోయి జబ్బులతో బాధపడుతూన్న బీద కుటుంబాలకు సేవ చేస్తూ — మా జీవనయానం సాగిస్తున్నాం.

Edited and Published by A. N. Raghavachar, No. 32, Krishnappa Naick Tank St., G. T. Madras.
printed by P. Seetharamiah at Rupavani Press, 73, Acharappan St., G. T. Madras.